క్లుప్తంగా

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



చిన్నారులతో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, ఉపాధ్యక్షుడు సుగుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అందులో ఆర్‌అండ్ఆర్ కాలనీలో శిబిరాన్ని ప్రారంభించామని చెప్పారు. కోచ్ నర్సింహులు ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని, విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు చక్రపాణి, ఎల్లయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : పల్లా



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): సీఎం సహాయనిధి పేదలకు వరంగా మారిందని జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రం, మండల పరిధిలోని మొత్తం 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4,82,500ల విలువైన చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఆపదలో ఆసుపత్రిలో చేరిన వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

నేటి గోపుర కలశ ప్రతిష్ఠోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

ములుగు(గజ్వేల్): మండలంలోని పాత మామిడ్యాల మెట్టుచింత వద్ద కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా జరుగనున్నాయి. రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యవసాయ క్షేత్రంలోని ఈ ఆలయంలో శుక్ర, శనివారాలు రెండురోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో రేణుకాచౌదరి దంపతులు పాల్గొంటారని మాజీ ఎంపీటీసీ తమ్మలి శ్రీనివాస్ చెప్పారు. 9వ తేదీన ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 10న ఉదయం నుంచి కలశాలకు అభిషేకం నిర్వహిస్తారని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వైభవంగా జ్యోతిర్లింగ వార్షికోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంపై శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలతో పాటు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగ్రామ్ మహారాజ్, వీరధర్మజ స్వామి, సర్వేశ్వర అంబికా మహారాజ్ ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధు, నారాగౌడ్, మురళి పంతులు, పెరుమాండ్లగౌడ్, ప్రసాద్‌రెడ్డి, కిశోర్, రాజేశ్వరరావు, ఆలయ కమిటీ బాధ్యులు కొత్త ప్రభు, కందుకూరి రవీందర్ తదితరులు ఉన్నారు.

చేపల మృతిపై విచారణ

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌలాపూర్ గ్రామశివారులోని పెద్ద చెరువులో చేపలు అనుమానాస్పదంగా మృతి చెందడంపై తహసీల్దార్ పర్వీన్ షేక్ విచారణ చేపట్టారు. గురువారం చెరువును తహసీల్దార్ పరిశీలించారు. చేపల మృతిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

వేసవి శిబిరం.. విజ్ఞాన వికాసం

- సాక్షి, అంబిటస్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు
- స్పోకెన్ ఇంగ్లిష్, కరాటేపై మరింత ఆసక్తి



శిబిరంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేటకమాన్: వేసవి సెలవుల్లో చిన్నారులు ఏదోఒక కొత్త అంశాన్ని నేర్చుకోవాలని, ఎండల్లో ఆటలాడి అనారోగ్యం బారిన పడకూడదనే ఉద్దేశ్యంతో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సాక్షి, సిద్దిపేట అంబిటస్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అంబిటస్ పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. శిబిరంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు చిన్నారులకు మాస్టర్ భాగ్యరాజ్ కరాటే శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 10.30 వరకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, చేతిరాత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ లాంటి వివిధ అంశాలు నేర్పిస్తున్నారు. సుమారు వంద మందికి పైగా చిన్నారులు శిక్షణ తీసుకుంటున్నారు. 5న ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం 18వ తేదీ వరకు కొనసాగనుంది.

చిన్నారుల్లో నైపుణ్యం పెరుగుదల

పిల్లలు తమ వార్షిక పరీక్షలు ముగియడంతో వారికి ఏవైనా కొత్త విషయాలు నేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సెలవుల్లో చిన్నారులు ఎక్కువగా సెల్‌ఫోన్, టీవీ చూస్తూ సమయం గడుపుతుంటారు. వాటి నుంచి వారిని దూరం చేయడానికి, కొత్త విషయాలపై ఆసక్తిని పెంచడానికి ఈ శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయి. కొత్త విషయాలు పిల్లల్లో మానసిక శక్తిని అభివృద్ధి చేస్తాయని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ శిబిరంలో టీచర్ సాహితి స్పోకెన్ ఇంగ్లిష్, శ్రీజ హ్యాండ్ రైటింగ్, అపర్ణ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, అలాగే మాస్టర్ వాసుదేవ్ నృత్యంలోను శిక్షణ ఇస్తున్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్, టీవీ చూడటానికి ఎక్కువ సమయం కేటాయిస్తారు. సోషల్ మీడియాకు అలవాటుపడి సమయం వృథా చేయకుండా నూతన విషయాలు నేర్చుకోవాలి. ప్రస్తుత రోజుల్లో ఇంగ్లిష్ చాలా అవసరం. అందుకే చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్నాం. రానున్న కాలంలో వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. పిల్లలు కూడా చాలా ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు.

– సాహితి, స్పోకెన్ ఇంగ్లిష్ టీచర్

చేతిరాత, నృత్యం నేర్చుకుంటున్నాం



పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి పూర్తిచేశాం. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా ఈ శిక్షణ శిబిరానికి వస్తున్నాం. స్నేహితుల ద్వారా తెలుసుకుని ఇక్కడ చేరాం. హ్యాండ్ రైటింగ్, డ్యాన్స్ నేర్చుకుంటున్నాం. నిర్వాహకులకు ధన్యవాదాలు.

– నక్షత్ర, హర్షిత, విద్యార్థినులు

తెలంగాణ ఉద్యమంలో పొన్నం పాత్ర కీలకం



వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక(గజ్వేల్)/చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా లింగారావు మాట్లాడుతూ బలహీన వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ తెలంగాణా ఉద్యమ సమయంలో కీలకంగా పని చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా చేర్యాలలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా, నాయకులు ఒగ్గు మల్లేశం, వెలగల దుర్గయ్య, బుట్టి యాదగిరి, పోతుగంటి ప్రసాద్‌గౌడ్, తాటిపాముల పరశురాములుగౌడ్, బిర్యాకి శ్రీనివాస్, పోలోజు ఆంజనేయులు, తుమ్మ కుమార్, చింతల రవి, చింతల రాజు, పండుగ వెంకటేశ్, చింతల బాలరాజ్, దండబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.20,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

1,636 దరఖాస్తులు

హుస్నాబాద్‌రూరల్: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూపొందించిన రాజీవ్ యువ వికాస్ పథకానికి మండలంలో 1,636 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్సీ 431, ఎస్టీ 264, బీసీ 896, ఈబీసీ 28, మైనార్టీ 17 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొందరు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపించడం లేదని, అధికారులు ఫోన్‌చేసి దరఖాస్తులు ఇవ్వాలని సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని ఆయన తెలిపారు. దరఖాస్తులను విభజించి బ్యాంకుల వారీగా ఆయా బ్యాంకులకు పంపించనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

బెజ్జంకి(సిద్దిపేట): కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకితో పాటు మండలంలోని ముత్తన్నపేట, తోటపల్లి, దాచారం, బెజ్జంకి క్రాసింగ్‌లలో గురువారం సమావేశాలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీలు ఎంపిక చేశారు. కార్యక్రమాలలో మధు, రూపేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

సీఐ శ్రీను కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐలు షేక్ మహబూబ్, సమత

చేర్యాల(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ ఎల్.శ్రీను సూచించారు. చేర్యాల సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 35 మందికి గురువారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవించి కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపబోమని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మద్దూర్ ఎస్ఐ షేక్ మహబూబ్, చేర్యాల ప్రొబెషనరీ ఎస్ఐ సమత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతమాత నుదిట దిద్దిన సిందూరం

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'భారతమాత నుదిట దిద్దిన సిందూరం మనకు గర్వకారణం. అలాంటి సిందూర్ పేరుతో చేపట్టిన ఉగ్రవాద శిబిరాల కూలివేత భారతదేశం సాధించిన ఘన విజయం' అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్ కవ్వింపు చర్యలు చేస్తోందని, ఇది సరికాదన్నారు. భారత గగనతలంలోకి రావడం గగనం అనే విషయాన్ని ఈరోజు భారత సైనికులు మరొకసారి నిరూపించారన్నారు. పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్ర వాదులు ప్రపంచంలో ఎక్కడ ఉన్న పట్టుకొని శిక్షిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది కార్య రూపందాలుస్తోందన్నారు. అనంతరం వ్యాస మహర్షి అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. యోగా ప్రాచీన జీవన విధానమే అయినప్పటికి ప్రపంచానికి పూర్తిగా పరిచయం చేసింది ప్రధాని మోదీనే అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాల్సిందే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బతుకులు మారడం లేదని మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వకపోతే ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు చెందిలా చేస్తామన్నారు. ప్రజాపాలన అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క ప్రజా సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ అందాల పోటీలే ముఖ్యమైనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలందరినీ కలుపుకొని రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు సీపీఎం జిలా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

రైతు కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి

తొగుట(దుబ్బాక): నాణ్యమైన విత్తనాలు సాగుచేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని గుడికందుల రైతు వేదికలో గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విత్తన చట్టాన్ని తీసుకువస్తుందన్నారు. ఈ చట్టంతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగుచేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలాంటి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదును జాగ్రత్తగా ఉంచాలని కోరారు. అనంతరం శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ అధిక మోతాదులో యూరియా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. అవసరం మేరకే రసాయన ఎరువులు ఉపయోగించాలని, ఒకే పంట కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. వాణిజ్య పంటల సాగుతో రైతులకు మరింత ఆదాయం సమకూతుందని చెప్పారు. యాసంగిలో సన్‌ఫ్లవర్, మొక్కజొన్న, పెసర వంటి పంటలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమాదేవి, ఉమారాణి, ఏఓ మోహన్, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈఓ తిరుపతి, ఏఈఓలు దేవేందర్, సాయి కుమార్, పంచాయతీ కార్యదర్శి రజని, రైతులు పాల్గొన్నారు.

మారని తీరు

11 దుకాణ సముదాయాలకు దరఖాస్తులు కరువు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్: దేవుడు కరుణించినా పూజారి వరమివ్వడన్నట్టు తయారైంది దుబ్బాక మున్సిపాల్టీ తీరు. పట్టణంలో లాల్ బహదూర్ శాస్త్రి, డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలోని దుకాణ సముదాయాలకు రెండో సారి వేలం పాట నిర్వహించినా తీరు మారడంలేదు. గురువారం 11 దుకాణ సముదాయాలకు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కేవలం ఒక్క షట్టర్‌కు మాత్రమే కృష్ణవేణి అనే మహిళ నుంచి దరఖాస్తు వచ్చింది. పోచమ్మ దేవాలయం సమీపంలో గల 4వ నంబరు షట్టర్‌ను రూ.7,800 అద్దె ప్రాతిపదికన ఆమె దక్కించుకుంది.

ఖాళీగా 11 షట్టర్లు

పోచమ్మ దేవాలయం సమీపంలో ఒక షట్టర్, శాస్త్రీనగర్ సమీపంలో ఆరు షట్టర్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నాలుగు షట్టర్లకు దరఖాస్తులు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు అధికారులు చెప్పారు. 11 షట్టర్లు ఖాళీగా ఉండడంతో మున్సిపల్ ఆదాయం వృథాగా పోతుందని ప్రజలు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీపీఐ జిల్లా నేత అశోక్



నినాదాలుచేస్తున్న అశోక్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం కృషి చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. మండల పరిధిలోని చుంచనకోటలో గురువారం సీపీఐ పదో గ్రామ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నబోయిన విఠలయ్య ఆ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కామల్ల అయిలయ్య అధ్యక్షతన జరిగిన సభలో అశోక్ మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి దేశ స్వాతంత్ర్య ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా ఇమ్మడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా పుల్ల కుమార్ తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, నర్సింహాచారి, సుదర్శన్, కనకయ్య, సత్తయ్య, విఠలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



చిన్నకోడూరులో నిరుపయోగంగా ఉన్న గిద్దంగి

ఆ గిడ్డంగి.. మందుబాబుకు కాదు అడ్డంకి

లక్షలు వెచ్చించి నిర్మించిన గిడ్డంగి ఎన్నోయేళ్లుగా నిరుపయోగంగా మారింది. చిన్నకోడూరు శివారులో పౌరసరఫరాల సంస్థ గిడ్డంగి నిర్మాణం పూర్తిచేసి 2015లో ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు గోదాములో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించక పోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా గిడ్డంగిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

చిగురించని అన్నదాత ఆశ

- మొలవని విత్తు.. రైతన్న చిత్తు
- నాచారంలో అంకురించని మొక్కజొన్న
- నకిలీ విత్తనాలతో ఆందోళన
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

నకిలీ విత్తనాలు రైతులకు శాపంగా మారాయి. ఆరుగాలం పడిన శ్రమంతా వృథాగా పోతుంది. నాణ్యత లోపించిందో, నకిలీ విత్తనమో తెలియదుగాని మండల పరిధిలోని నాచారంలో మొక్కజొన్న సాగుచేసిన ఓ రైతు మొలకెత్తని విత్తనంతో నష్టాలపాలయ్యాడు. ఆరుతడి పంటతో నాలుగు కాసులు మిగులుతాయని ఆశపడితే నాణ్యతలేని విత్తనాలు అంటగట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు.



మొలకెత్తని పొలాన్ని చూపుతున్న రైతు వెంకటేశ్

వర్గల్(గజ్వేల్): నాచారం గ్రామానికి చెందిన రైతు కట్టె వెంకటేశ్ ఎకరం విస్తీర్ణంలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగుచేయాలనుకున్నాడు. గజ్వేల్‌లోని ఓ విత్తన దుకాణం నుంచి రూ. 2,400 వెచ్చించి, గత నెల 19న ఎనిమిది కిలోల 'జేకే 502' విత్తనాలు కొనుగోలు చేశాడు. పొలాన్ని నాలుగు సార్లు దున్ని దుక్కి సిద్ధం చేశాడు. అశ్విని కార్తెలో మొక్కజొన్న సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని, జూన్‌లో వచ్చే ఈ పచ్చి కంకులకు మార్కెట్లో మంచి డిమాండ్ ధర ఉంటుందని అనుకున్నాడు. కాని అది అడియాసే అయ్యింది.

అధిక ఆదాయం వస్తుందని..

రూ.70 వేలు వరకు ఆదాయం వస్తుందని పొలంలో బోదెలు తీసి 22, 23 తేదీలలో అడుగుకు ఒకటి చొప్పున గింజలు విత్తాడు. దుక్కి చేసేందుకు, ఎరువులకు, విత్తనాలు పెట్టే కూలీలకు తదితరాలకు కలిపి రూ.16 వేలు వరకు వెచ్చించాడు. పొలంలో డ్రిప్ అమరిక ఉండడంతో వేసవిలో నీటి కొరత లేకుండా పంట చక్కగాఎదుగుతుందని భావించాడు.

మొలకలు సగం సగం

పొలంలో వేసిన విత్తు పదిరోజుల్లో చిగురించాలి. కాని పది రోజులు దాటినా మొలకెత్తలేదు. అక్కడో మొక్క, ఇక్కడో మొక్క అన్నట్లు సగం సగం మొలిచాయి. రెండు రోజులు ఆగితే పూర్తిగా విత్తులు మొలకెత్తుతాయనుకున్నాడు. గింజ భూమిలోనే మెత్తబడింది. సగం సగం మొక్కలతో పొలం బోసిపోయింది.

పరిహారం ఇప్పించండి



మొక్కజొన్న సాగుచేస్తే మంచి దిగుబడి వస్తదని ఆశపడ్డ. జూన్ వరకు పచ్చికంకులు వస్తే ధర కూడా బాగుంటదని గజ్వేల్ షాపుల రూ.2,400లకు రెండు ప్యాకెట్లు(8 కిలోలు) జేకే 502 రకం విత్తనాలు తెచ్చిన. అడుగుకు ఒకటి చొప్పున విత్తనాలు వేయించిన. ఏరి పారేసినట్లు సగం సగం మొక్కలే వచ్చినయ్. రూ.16 వేలు వరకు ఖర్చయింది. రూ.70 వేలు లాభమొస్తుదనుకుంటే విత్తనం సరిగా మొలవక కష్టమంతా వృథాగా పోయింది, పంట సీజన్ అదును దాటింది. చేను దున్నేసి వేరే పంట వేసుకునే పరిస్థితి ఏర్పడ్డది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారమిప్పించాలె. నాణ్యతలేని విత్తనాలు అంటగట్టిన దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలె.

– కట్టె వెంకటేశ్, రైతు, నాచారం

నాణ్యత లోపిస్తే ఉపేక్షించం



రైతులకు నాణ్యత లోపించిన విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించబోం. రైతును రాజుగా చేయాలని ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తున్నది. నకిలీ, కల్తీ, నాణ్యతలేని విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు తరచూ విత్తన విక్రయ దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పూర్తి స్థాయిలో విత్తనం మొలకెత్తక నాచారం రైతు నష్టపోయిన విషయం మా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారమివ్వాలి.

– శేషశయన, మండల వ్యవసాయాధికారి